సాక్షి కామారెడ్డి

గురువారం । 10 । జూలై । 2025



పొంచి ఉన్న ప్రమాదం

మాచారెడ్డి ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పెచ్చులూడుతుండడంతో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారు.

- 9లో ▸



పాఠశాలలో పాముల బెడద

నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మకూర్ హైస్కూల్ గదులలోకి తరచూ పాములు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయపడుతున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /22.1

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

పాఠశాల పునఃప్రారంభం



సదాశివనగర్: దగ్గి గ్రామంలో మూతపడ్డ ప్రాథమిక పాఠశాలను బుధవారం డీఈవో రాజు పునఃప్రారంభించారు. గతంలో విద్యార్థులు లేకపోవడంతో ఈ పాఠశాలను మూసివేశారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్‌రెడ్డి గ్రామస్తులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను వివరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. దీంతో ఈ ఏడాది పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో బుధవారం పాఠశాలను పునఃప్రారంభించారు. కార్యక్రమంలో సీఆర్పీ నందురావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్త సబ్‌స్టేషన్లతో మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా

కామారెడ్డి అర్బన్: కొత్త సబ్‌స్టేషన్లతో మరింత నాణ్యమైన విద్యుత్ అందుతుందని ఎస్ఈ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి కామారెడ్డి సర్కిల్ పరిధిలో నాలుగు సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చిట్యాల, మహ్మద్‌నగర్ సబ్‌స్టేషన్ల పనులు ముమ్మరంగా కొనసాగుతుండగా, బోర్గాం, కామారెడ్డి ఇండోర్ సబ్ స్టేషన్లకు టెండర్లు పిలిచామని పేర్కొన్నారు. కొత్త సబ్‌స్టేషన్లలో స్కాడా అనుసంధానం వంటి ఆధునిక సాంకేతికను వినియోగిస్తున్నామని వివరించారు. దీని ద్వారా రియల్ టైం ఫీడర్ మానిటర్ చేయగలమని పేర్కొన్నారు.

బోనాల పండుగకు ఆహ్వానం



దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు బుధవారం జిల్లాకేంద్రానికి వెళ్లి ఎస్పీ రాజేశ్ చంద్ర, ఏఎస్పీ చైతన్యరెడ్డిలను కలిశారు. ఆదివారం నిర్వహించే బోనాల పండుగకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సిద్ధారెడ్డి, అర్చకుడు శరత్ చంద్ర, బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



మాచారెడ్డి: మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌ను బుధవారం కామారెడ్డి అసిస్టెంట్ ఎస్పీ చైతన్యరెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కామారెడ్డి రూరల్ సీఐ రామన్, ఎస్సై అనిల్ ఉన్నారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేసి పదోన్నతిపై వెళ్తున్న కానిస్టేబుళ్లు రామారావు, స్వామిలను ఎస్సై అనిల్ సన్మానించారు.

వారానికో హత్య!



గతనెల 5న పిట్లం మండలం చిన్నకొడప్‌గల్ పంచాయతీ కార్యదర్శి ధరావత్ కృష్ణ (28) హత్యకు గురయ్యాడు. కేసును పరిశోధించిన పోలీసులు.. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే దారుణం జరిగిందని తేల్చారు. ఈ కేసులో నలుగురిని అరెస్టు చేశారు.

కొన్నాళ్ల క్రితం పిట్లం మండల కేంద్రానికి చెందిన సాబేరా బేగం(60)ను ఆమె కొడుకు షాదుల్ రోకలిబండతో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలపాలై, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. గతంలో షాదుల్ తన సోదరుడిని హతమార్చాడు. ఆ కేసులో ఫిర్యాదుదారైన తల్లితో కేసు రాజీ కోసం వచ్చి హతమార్చాడు.

పిట్లం మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన జిన్నా లక్ష్మి (50) ఈనెల 3న హత్యకు గురైంది. అప్పుగా తీసుకున్న డబ్బులు ఇవ్వాలని అడిగిన లక్ష్మిని.. ఆమె అల్లుడు కమ్మకత్తితో దాడి చేసి చంపాడు. ఈ కేసులో అల్లుడు బాలరాజును పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు పంపించారు.

ఈ ఏడాది జనవరి 19న రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన పాక్కిలి రవి (41) అనే వ్యక్తి ఇంట్లోనే హత్యకు గురయ్యాడు. భూ వివాదంలో సొంత అన్న సుపారీ ఇచ్చి హత్య చేయించినట్టు పోలీసులు తేల్చారు. ఈ కేసులో అన్న కిష్టయ్య, అన్న కొడుకుతో పాటు మరో ముగ్గురు జైలు పాలయ్యారు.

మే 24న లింగంపేట మండలం అయ్యపల్లి తండాకు చెందిన దేవసోత్ ఫకీరా (46) హత్యకు గురయ్యాడు. కుటుంబంలో పెళ్లి విషయంలో తలెత్తిన గొడవల నేపథ్యంలో ఫకీరాను ఆయన కొడుకు ప్రకాశ్ గొడ్డలితో తలపై కొట్టడంతో చనిపోయాడు.

- జిల్లాలో పెరుగుతున్న నేర సంస్కృతి
- మద్యం మత్తు, క్షణికావేశంతో దారుణాలు
- ఆస్తి తగాదాలు, వివాహేతర సంబంధాలతోనే ఎక్కువ నేరాలు
- ఆందోళన కలిగిస్తున్న ఘటనలు

ఆర్థిక లావాదేవీలు, వివాహేతర సంబంధాలకు తోడు కుటుంబ కలహాలు హత్యలకు పురిగొల్పుతున్నాయి. ఆగ్రహాన్ని నియంత్రించుకోలేని మనిషి మృగంలా మారుతున్నాడు. మద్యం మత్తు ఆపై కోపోద్రేకంతో విచక్షణ కోల్పోయి హత్యలకు పాల్పడుతున్నాడు. జిల్లాలో వారానికో హత్య కేసు నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

జిల్లాలో ఈ ఏడాది జనవరినుంచి జూన్ చివరి వరకు 26 హత్యలు జరిగాయి. సగటున దాదాపు వారం రోజులకో హత్య కేసు నమోదవుతోంది. ఇందులో చాలా వరకు వివాహేతర సంబంధాలు, ఆస్తి తగాదాల నేపథ్యంలోనే జరిగినట్టు స్పష్టమవుతోంది. ఒక కేసులో నేరస్తులను పట్టుకుని రిమాండుకు తరలించేలోపు జిల్లాలో మరో హత్య కేసు వెలుగుచూస్తోంది. హత్య కేసుల విషయంలో పోలీసులు సీరియస్‌గానే వ్యవహరిస్తున్నారు. నేరస్తులకు శిక్షలు పడేలా సాక్ష్యాధారాలను కోర్టు ముందుంచుతున్నారు. ఫలితంగా పలు కేసుల్లో హంతకులకు యావజ్జీవ శిక్షలు పడుతున్నాయి. ఎక్కడైనా హత్య కేసులను సీరుగార్చే విధంగా పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులు వారిపైనా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల రామారెడ్డిలో ఓ కేసు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్సైని సస్పెండ్ చేశారు.

చిచ్చుపెడుతున్న సంబంధాలు...

కుటుంబాల్లో వివాహేతర సంబంధాలు చిచ్చు పెడుతున్నాయి. భార్య/భర్త వివాహేతర సంబంధం పెట్టుకున్నట్టు తెలిసిన మరుక్షణం గొడవలు మొదలై హత్యలకు దారితీస్తున్నాయి. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను లేదా భార్యను హతమారుస్తున్నారు. సుపారీ ఇచ్చి చంపడానికి కూడా వెనకాడడం లేదు. ఇటీవల బైకుపై వెళుతున్న యువకుడిని కొందరు దుండగులు వెంబడించి దాడి చేశారు. తీవ్ర గాయాలపాలైన అతడు బతికిబయటపడగా.. బాధితుడి భార్యే సుపారీ ఇచ్చి చంపించడానికి ప్రయత్నించినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో భార్యను, దాడి చేసిన వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. చాలా కేసుల్లో వివాహేతర సంబంధానికి అడ్డును తొలగించుకునేందుకు హత్యలకు పాల్పడుతున్నారు.

ఆస్తుల చుట్టూ..

భూములు, ఆస్తుల తగాదాల నేపథ్యంలోనూ హత్యలు జరుగుతున్నాయి. కుటుంబంలో అన్నదమ్ములు, పాలివారి మధ్య ఆస్తుల విషయంలో తలెత్తే గొడవల్లో హత్యలకు పాల్పడుతున్న సంఘటనలూ పెరిగాయి. భూముల విలువలు పెరిగిన తరువాత వివాదాలు ఎక్కువయ్యాయి. భూ సమస్యలు కూర్చుని మాట్లాడుకుంటే పరిష్కారమవుతాయి. కానీ ఎవరూ తగ్గకపోవడంతో కక్షలు పెంచుకుని దాడులకు పాల్పడుతుండడంతో ప్రాణాలు పోతున్నాయి. చాలా సంఘటనల్లో రక్తసంబంధీకులే హంతకులుగా తేలుతున్నారు. క్షణికావేశంలో చేసిన హత్యలతో హత్యకు గురైన వ్యక్తితో పాటు, హత్య చేసిన వ్యక్తి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

పంటకు లేదు 'బీమా'!



- బీమా పథకాన్ని విస్మరించిన ప్రభుత్వం
- అకాల వర్షాలు, వరదలతో ఏటా దెబ్బతింటున్న పంటలు
- నష్టపోతున్న రైతన్నలు

కామారెడ్డి క్రైం: అధిక వర్షాలు, వరదలు, అకాల వర్షాలు, వడగండ్లు.. ఇలా ప్రకృతి వైపరీత్యాలతో ఏటా పంటలకు నష్టం వాటిల్లుతూనే ఉంది. దీంతో అన్నదాతలు నష్టపోతున్నారు. పంటలకు బీమా లేకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

జిల్లాలో 3.28 లక్షల మంది రైతులున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 5.24 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ప్రధాన పంటగా వరి 3 లక్షలకుపైగా ఎకరాలలో సాగు కానుంది. ఇప్పటివరకు 1.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారు. ఇందులో 32,552 ఎకరాల్లో మక్క, 51,802 ఎకరాల్లో సోయా, 17,713 ఎకరాల్లో పత్తి, 6,965 ఎకరాల్లో కంది, దాదాపు 35 వేల ఎకరాల్లో వరి వేశారు.

2017–18 వరకు రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమలులో ఉంది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం అమలును నిలిపివేసింది. దీంతో ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు బీమా అందకుండాపోయింది. 2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గతేడాది ఫసల్ బీమా పథకాన్ని ప్రారంభించేందుకు చర్చలు జరిపింది. బీమా కంపనీలతో సంప్రదింపుల ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈసారి కూడా ఇప్పటికీ ప్రభుత్వం నుంచి పంటల బీమా విషయంలో ఎలాంటి ప్రకటన లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గతేడాది మార్చిలో కురిసిన అకాల వర్షాలతో జిల్లాలో 18,212 మంది రైతులకు సంబంధించిన 10,328 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం రూ. 16 కోట్ల పరిహారం విడుదల చేసింది. పంటల బీమా పథకాన్ని అమలు చేస్తే రైతులకు మరింత మేలు జరిగేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వెంటనే పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

సమాచారం లేదు..



పంట నష్టం జరిగిన ప్రతిసారి క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందేలా చూస్తున్నాం. బీమా పథకాన్ని అమలు చేయడంపై ఇప్పటివరకైతే మాకు ఎలాంటి సమాచారం రాలేదు. దానిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుంది.

– తిరుమల ప్రసాద్, డీఏవో, కామారెడ్డి

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



కళాశాల టాపర్లకు నగదు బహుమతిని అందిస్తున్న ఇంటర్ పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డిరూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఇంటెలిజెన్స్ ఎస్పీ రంజన్ రతన్ సూచించారు. బుధవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1980–82 బ్యాచ్‌కు చెందిన ఇంటర్ పూర్వ విద్యార్థులు ఇదే కళాశాలలో గతేడాది టాపర్లుగా నిలిచిన మహాలక్ష్మి, నందినీలకు రూ. 10 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను సైతం ఇదే కళాశాలలో ఇంటర్ చదివానన్నారు. చదువుతో పాటు క్రీడలలో రాణించడం వల్లే ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. వచ్చే ఏడాది ఇంటర్ టాపర్లకు రూ. 25 వేల ప్రోత్సాహకాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ విశాల, లెక్చరర్లు రామచంద్రరావు, రమేష్, పూర్వ విద్యార్థులు ఆంజనేయులు, మూర్తి పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌లోకి తగ్గిన ఇన్‌ఫ్లో

బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతో ఎస్సారెస్పీ ప్రాజెక్ట్‌లోకి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్ట్‌లోకి 4,300 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 341 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1067.70 (19.8టీఎంసీలు)అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు. గతేడాది ఇదే రోజున ప్రాజెక్ట్‌లో 1061.7 (12.2 టీఎంసీలు) అడుగు నీరు నిల్వ ఉంది.

అసంపూర్తిగా సమీకృత మార్కెట్

- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని పనులు
- బిల్లులు రాకపోవడంతో చేతులెత్తేసిన కాంట్రాక్టర్



ఎల్లారెడ్డిలో అసంపూర్తిగా ఉన్న సమీకృత మార్కెట్ నిర్మాణం

ఎల్లారెడ్డి: పట్టణ ప్రాంతాలైన కార్పోరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో నిత్యావసరాలైన కూరగాయలు, మాంసం ఉత్పత్తులు, పండ్లు ఒకేచోట లభించేందుకు గత ప్రభుత్వం సమీకృత మార్కెట్ల(ఇంటిగ్రేటెడ్ మార్కెట్)ను మంజూరు చేసింది. జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణం కోసం కామారెడ్డికి రూ. 4 కోట్లు, ఎల్లారెడ్డి, బాన్సువాడలకు రూ. 2 కోట్ల చొప్పున మంజూరు చేశారు. ఈ పనులకు 2021–22 ఆర్థిక సంవత్సరంలో టెండర్లు పూర్తి చేశారు. 2022 లో టెండర్లు పొందిన కాంట్రాక్టర్లు అగ్రిమెంట్లు పూర్తి చేసుకుని నిర్మాణ పనులను ప్రారంభించారు.

అగ్రిమెంట్లు చేసుకున్న కామారెడ్డి, బాన్సువాడ కాంట్రాక్టర్లకు టెండర్ మొత్తంలో సగభాగాన్ని అడ్వాన్స్‌గా ఇచ్చారు. అయితే ఎల్లారెడ్డిలో మార్కెట్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో డీఎస్పీ, నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ కార్యాలయాలు ఉండడంతో వాటిని ఖాళీ చేయడానికి చాలా కాలం పట్టింది. 2022లో అగ్రిమెంట్ చేసుకున్నా మార్కెట్ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో కార్యాలయాలను కూల్చివేసి స్థలం అప్పగించే ప్రక్రియ 2023 డిసెంబర్‌కు కానీ సాధ్యం కాలేదు. నిర్మాణ పనులు చేపట్టడంలో సుదీర్ఘ జాప్యం జరగడంతో ఎల్లారెడ్డి కాంట్రాక్టర్‌కు అడ్వాన్స్ అందలేదు. అయినా బిల్లులు వస్తాయన్న ఆశతో సొంత డబ్బులతో పనులు చేశారు. గతేడాది ఆగస్టు వరకు 80 శాతం పనులు పూర్తయ్యాయి. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. చేసిన పనులకు ఇప్పటివరకు నయా పైనా బిల్లు రాలేదని కాంట్రాక్టర్ వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ. 1.60 కోట్ల బిల్లులు రావాల్సి ఉందన్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కోరుతున్నా పట్టించుకునేవారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరగా పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో నిధులు..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు రావాల్సిన బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఏ మార్కెట్‌లో ఎంత వరకు పనులు జరగాయన్న విషయమై ప్రభుత్వం నివేదికలు సేకరిస్తోంది. త్వరలోనే నిధులు మంజూరు చేసే అవకాశాలున్నాయి.

– మహేశ్‌కుమార్, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్

యూరియా కోసం బారులు



క్యూలో నిలుచున్న రైతులు

యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. బుధవారం రైతులు తాడ్వాయిలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద బారులు తీరారు. గోదాంకు యూరియా లారీలు వచ్చాయని తెలియడంతో ఉదయమే వచ్చి క్యూలో నిల్చున్నారు. ఏవో నర్సింలు మాట్లాడుతూ యూరియా కొరత లేదన్నారు. సొసైటీలో ఇంకా 650 బస్తాల యూరియా ఉందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

– తాడ్వాయి

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

కామారెడ్డి టౌన్: ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ తీశారు. కొత్త బస్టాండ్ వద్ద పరిషత్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రోహిత్, నాయకులు నరేష్, స్వామి, వెంకటస్వామి, రాహుల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలో ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలను జరిపారు. అంబేద్కర్ చౌరస్తా ప్రాంతంలో భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ కృషి చేస్తోందన్నారు. నేతలు మహేష్, వినోద్, తులసి, దేవేందర్, రాజేష్, కాశి పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ర్యాలీలో పాల్గొన్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

సార్వత్రిక సమ్మె విజయవంతం



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

కామారెడ్డి టౌన్: జిల్లాలో బుధవారం నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతమైందని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు పాలడుగు సుధాకర్ పేర్కొన్నారు. సమ్మె నేపథ్యంలో జిల్లాకేంద్రంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికలోకం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, ఏఐటీయూసీ నేతలు దశరథ్, బాల్‌రాజ్, ఆయా సంఘాల నాయకులు నర్సింలు, రాజనర్సు, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యూరియా కొరత లేకుండా చూడాలి



కామారెడ్డి: యూరియా కొరత లేకుండా చూడాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్ రెడ్డి అన్నారు. బుధవారం సదాశివనగర్ రైతు వేదిక భవనంలో మండల స్థాయి భారతీయ కిసాన్ సంఘ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రబీ సీజన్లో పండించిన సన్న వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన రైతు రుణమాఫీ రూ. 2 లక్షలు వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన మార నారాయణరెడ్డిని నూతన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి, తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల సంఘాలు ఏర్పాటు చేయాలి



రాజంపేట: మహిళా సంఘాలు దివ్యాంగ కిశోర బాలికల సంఘాలు ఏర్పాటు చేయాలని అదనపు డీఆర్‌డీవో విజయలక్ష్మి అన్నారు. రాజంపేట మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించిన ఇందిర మహిళా శక్తి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో ఆదాయాభివృద్ధి కార్యక్రమంలో బ్యాంకు రుణాలు, స్త్రీనిధి, గ్రామ సంఘం రుణాల రికవరీలో రాజంపేట మండల మహిళా సంఘం మొదటి స్థానంలో ఉండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే కొత్తగా మహిళా సంఘాలు దివ్యాంగ కిశోర బాలికల సంఘాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమాఖ్య అధ్యక్షులు లక్ష్మి, ఏపీఎం సాయిలు, సీసీ శ్రీనివాస్, వీవోఏలు పాల్గొన్నారు.

ఆలయాలకు నూతన కార్యవర్గం ఏర్పాటు

నిజామాబాద్ రూరల్: నగరంలోని జెండాబాలాజీ, శంభులింగేశ్వరాలయం, హమాల్‌వాడి సాయిబాబా ఆలయాలకు నూతన పాలకవర్గం ఏర్పాటు చేస్తూ దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి జెండా బాలాజీ ఆలయానికి డైరెక్టర్లుగా ప్రమోద్‌కుమార్, నర్సింగ్‌రావు, కిరణ్ కుమార్, వేముల దేవిదాస్, లక్ష్మణ్, విజయ, రాజ్‌కుమార్‌లు, హమాల్‌వాడి సాయిబాబా ఆలయానికి డైరెక్టర్లుగా గంగాకిషన్, శ్రీరాంశ్రీనివాస్, పవన్‌కుమార్, శివలింగం, శాంతాబాయి నియామకం అయ్యారు. శంభులింగేశ్వరాలయానికి డైరెక్టర్లుగా బి మధు, కిశోర్, సంతోష్‌కుమార్, కమలకిశోర్, మామిడిశేఖర్, రమేశ్, రేఖలను నియమించినట్లు జిల్లా ఎండోమెంట్ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

కళాశాల సరే.. భవనమేది.?

- నాలుగేళ్లుగా ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహణ
- బస్సు సౌకర్యం లేక కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపని విద్యార్థులు
- బీర్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పక్కా భవనం నిర్మించాలని విద్యార్థుల వేడుకోలు



బీర్కూర్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల

బాన్సువాడ: గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలతో సతమతమవుతుంది. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ప్రభుత్వ కళాశాలకు సొంత భవనం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బీర్కూర్ మండల కేంద్రంలో 2021లో ప్రభుత్వం జూనియర్ కళాశాలను మంజూరు చేసింది. కళాశాల ప్రారంభమైన నాటి నుంచి స్థానిక ఉన్నత పాఠశాలలోనే కళాశాల నిర్వహణ కొనసాగుతోంది. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, డీటీఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కళాశాలలో ముగ్గురు రెగ్యులర్ అధ్యాపకులు ఉండగా ఏడుగురు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. బీర్కూర్ మండల కేంద్రంతో పాటు దామరంచ, నస్రుల్లాబాద్ మండలంలోని మీర్జాపూర్‌లో మూడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఇంటర్ కోసం బాన్సువాడ, బోధన్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. కానీ బీర్కూర్‌కు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కావడంతో ఆయా ప్రాంతాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కానీ కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో ఉన్నత పాఠశాలలో ఉన్న గదుల్లో తరగతుల నిర్వహణ కొనసాగుతుండడంతో విద్యార్థులు ఈ కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులు కళాశాలకు రావాలంటే బీర్కూర్‌కు బస్సు సౌకర్యం లేదు. మిర్జాపూర్, తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన విద్యార్థులు కళాశాలలో చేరాలని ఉన్నా బీర్కూర్‌కు బస్సు సౌకర్యం లేక బాన్సువాడకు వెళ్తున్నారు. బరంగెడ్డి, బైరాపూర్, సంబపూర్ గ్రామాల్లో ఉండే విద్యార్థులు చాలా మంది బీర్కూర్‌కు రావాలని ఉన్నా సరైన సమయంలో బస్సు సౌకర్యం లేక బాన్సువాడ, బోధన్‌కు వెళ్తున్నారు. పలుమార్లు ఇక్కడి అధ్యాపకులు, నాయకులు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. కళాశాలకు సొంత భవనం నిర్మాణం చేపట్టి, బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

> **ఆర్టీసీ అధికారులకు విన్నవించాం**
>
> బీర్కూర్ చుట్టు పక్కల గ్రామాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. కానీ బస్సు సౌకర్యం లేక చాలా మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించాం. మిర్జాపూర్, తిమ్మాపూర్ గ్రామాల నుంచి సుమారు 20 మంది విద్యార్థులు వచ్చే అవకాశం ఉంది. కానీ బస్సు సమస్యతో కళాశాలలో చేరడం లేదు. అధికారులు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి.
>
> –మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపల్, బీర్కూర్

కుస్తాపూర్ నంది పోచంపాడ్‌లో ప్రతిష్ఠాపన



పోచంపాడ్‌లోని శివాలయం



కుస్తాపూర్ నుంచి తీసుకొచ్చి ప్రతిష్ఠించిన నంది విగ్రహం

బాల్కొండ: శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన కుస్తాపూర్ రామలింగేశ్వర స్వామి ఆలయం నుంచి నందిని తీసుకొచ్చి పోచంపాడ్ శివాలయంలో ప్రతిష్ఠించారు.

మీకు తెలుసా?

- పోచంపాడ్‌లో గోదావరి తీరాన కుస్తాపూర్ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని 1969వ సంవత్సరంలో పునఃనిర్మాణం చేపట్టారు.
- శ్రీరాముడు వనవాస కాలంలో కుస్తాపూర్ వద్ద బ్రహ్మ హత్య పాపం పోయేందుకు పూజలు చేసినట్లు చరిత్ర చెబుతోంది.
- కుస్తాపూర్ వద్ద శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగంగా ప్రసిద్ధి చెందింది.
- నాడు ఆలయం ముంపునకు గురి కావడంతో పోచంపాడ్ వద్ద తిరిగి పునఃనిర్మించారు. కాగా కుస్తాపూర్ నుంచి నందిని మాత్రమే తీసుకొచ్చి నూతన ఆలయంలో ప్రతిష్ఠించినట్లు గ్రామ పెద్దలు పేర్కొంటున్నారు.
- శ్రీరాముడు ఇసుకతో చేసిన శివలింగం ముంపునకు గురైన కుస్తాపూర్ ఆలయంలోనే ఉంది.
- ఎస్సారెస్పీ నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చెరువలో ఉన్నప్పుడు ఆలయం బయల్పడుతుంది. అప్పుడు అక్కడ కూడా భక్తులు పూజలు చేస్తారు.

కార్మికులు కలిసి కట్టుగా పోరాటం చేయాలి



ఎల్లారెడ్డిలో నిర్వహించిన కార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు



బాన్సువాడ ఆస్పత్రిలో ధర్నా చేస్తున్న కార్మికులు



బాన్సువాడలో సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు

సాక్షి నెట్‌వర్క్:జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన దేశవ్యాప్త సమ్మె విజయవంతమైంది. వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. ఆందోళనలు, రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం స్థానిక అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు కలిసికట్టుగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్ చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఎనిమిది గంటల పని దినాలను అమలు చేయాలన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.



భిక్కనూరు డిప్యూటీ తహసీల్దార్ రోజాకు వినతి పత్రం అందజేస్తున్న బీఎల్‌టీయూ నేతలు



కామారెడ్డి అర్బన్: ఎల్ఐసీ శాఖ వద్ద నిరసనలో పాల్గొన్న ఎంప్లాయీస్ యూనియన్ నేతలు



జిల్లా కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ ఆఫీసు వద్ద నిరసన తెలుపుతున్న సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు



దోమకొండలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎల్‌టీయూ ప్రతినిధులు

పాఠశాలలో పాముల బెడద..!

- భయాందోళనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఆత్మకూర్ ఉన్నత పాఠశాల తరగతి గది ముఖద్వారం వద్ద పాము కుబుసం



శిథిలమైన తరగతి గదిలో వెలసిన పుట్ట

కామారెడ్డి: నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మకూర్ హైస్కూల్‌లో కొన్నిరోజులుగా పాముల బెడద నెలకొంది. పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడం, చుట్టూ పంటపొలాలు ఉండడంతో తరుచూ పాఠశాలలోకి పాములు వస్తున్నాయి. దీనికితోడు పాఠశాలకు సంబంధించి శిథిలావస్థలో ఉన్న తరగతి గదుల తలుపులు, కిటికీలలో నుంచి పాములు లోనికి ప్రవేశిస్తున్నాయి. గత మంగళవారం సైతం పాఠశాలలోని ఓ తరగతి గది తలుపు వద్ద పాము కుబుసం ఉండడంతో అనుమానంతో ఉపాధ్యాయులు తలుపు వద్దనున్న చెక్కల మధ్య పరిశీలించి చూడగా రెండు పాములు దర్శనమిచ్చాయి. దీంతో భయాందోళన చెందిన ఉపాధ్యాయులు కర్రలతో రెండుపాములను కొట్టి చంపారు. ఒకవైపు విద్యార్థులకు సరిపడా తరగతిగదులు లేకపోవడంతో పాటు శిథిలావస్థకు చేరిన గదుల్లో దర్శనమిస్తున్న పాములతో అటు ఉపాధ్యాయులతోపాటు ఇటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాల ఆవరణలో ఉన్న శిథిలమైన తరగతి గదులను కూల్చేసి నూతన గదుల నిర్మాణానికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెత్త రీసైక్లింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి



నిజామాబాద్ సిటీ: డంపింగ్ యార్డులో చెత్త రీసైక్లింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఏజెన్సీ నిర్వాహకులకు మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ సూచించారు. నగర శివారులోని నాగారం డంపింగ్ యార్డును కమిషనర్ బుధవారం పరిశీలించారు. సిబ్బందితో పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. తడి, పొడిచెత్తను వేర్వేరుగా డంపింగ్ చేయాలని ఆదేశించారు. దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సై ప్రభుదాస్‌కు సూచించారు. తడిచెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్యాకెట్లలో నింపి ఎరువులు సిద్ధం చేసి బయటి వ్యక్తులకు విక్రయించాలన్నారు. ఆయా జోన్ కార్యాలయాల వద్ద సేంద్రియ ఎరువుల బ్యాగ్‌లు అందుబాటులో ఉంచాలన్నారు.

సమాజసేవలో ముందుండాలి

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు చదువుతో పాటు సమాజసేవా కార్యక్రమాల్లో ముందుండాలని తెలంగాణ యూనివర్సిటీ వైస్–ఛాన్స్‌లర్ టి యాదగిరావు అన్నారు. బుధవారం తెయూ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం, ఏబీవీపీ 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వీసీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏబీవీపీ ఇందూర్ విభాగ్ ప్రముఖ్ రెంజర్ల నరేశ్, ప్రొఫెసర్ ఆంజనేయులు, ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృత్ చారి, యూనివర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, ఉపాధ్యక్షుడు అనిల్, నాయకులు నవీన్, సమీర్, పృథ్వీ, అక్షయ్, మనోజ్, అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి



కమ్మర్‌పల్లి: గ్రామాల్లో నేరాల నియంత్రణకు పోలీసులు కృషి చేయాలని ఆర్మూర్ ఏసీపీ జె వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఎస్‌లోని రికార్డులు, కేసు డైరీలు, నిత్య కార్యకలాపాల నమోదులను పరిశీలించారు. నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ప్రజలతో సౌమ్యంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం నిర్వహించిన పరేడ్‌లో పాల్గొన్నారు. భీమ్‌గల్ సీఐ పి సత్యనారాయణ, ఎస్సై జి అనిల్ రెడ్డి ఉన్నారు.

వ్యాధుల నియంత్రణకు ప్రచారం కల్పించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ రూరల్: సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య, ఆరోగ్య శాఖతో పాటు స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి సూచించారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో జాతీయ కీటక జనిత రోగ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా డెంగీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. దోమలు వృద్ధి చెందకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. కరపత్రాల ముద్రణకు సహకరించిన ఇన్సూరెన్స్ చీఫ్ అడ్వైజర్ భాగ్యవతి, బాన్సువాడ డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, సీహెచ్‌వో దయానంద్, డాక్టర్ సమీఉల్లా, ఫార్మసిస్టు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఏఎస్సై భార్య మృతి

నిజామాబాద్ రూరల్: కుక్కను తప్పించబోయి డివైడర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఓ ఏఎస్సై భార్య మృతి చెందిన ఘటన కంఠేశ్వర్ బైపాస్ ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ పీఎస్ పరిధిలోని కేసీఆర్ కాలనీ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇంటలిజెన్స్ ఏఎస్సై భూమయ్య బుధవారం విధులకు వెళ్లగా భార్య భవాని(52), కుమారుడు చంద్రతేజ ఉదయం బాసరలోని అమ్మవారి దర్శనానికి బైక్‌పై వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కేసీఆర్ కాలనీ వద్ద కుక్కను తప్పించబోయి ప్రమాదవశాత్తు డివైడర్‌కు ఢీకొన్నారు. ఈ ఘటనలో భవాని తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

- 1.435 కిలోల ఎండు గంజాయి పట్టివేత



ఖలీల్‌వాడి: నగరంలోని పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని అర్సపల్లి, ఎల్లమ్మగుట్ట, అసద్ బాలానగర్ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ పేర్కొన్నారు. ఈ దాడిలో నిందితులు షేక్ పర్వేజ్, కసిలేరు మాధవ్, నజయా బేగంల నుంచి 1.435 కిలోల ఎండు గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడిలో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు రాజు, నారాయణ రెడ్డి, కానిస్టేబుళ్లు భోజన్న, షమీన్, శివ, సాయి, విష్ణు, అవినాష్ట మంజుల తదితరులు ఉన్నారు.

ఇంజినీరింగ్ చదివించడం లేదని..

- ఎలుకల మందు తాగి యువతి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: తల్లిదండ్రులు తనకు నచ్చిన ఇంజినీరింగ్ విద్యను అందించడం లేదనే బాధతో ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ యువతి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని అమ్మవెంచర్‌లో సుభ్‌దేవ్ సోనమ్‌తో పాటు అతని భార్య గత రెండేళ్లుగా మేస్త్రీ పని చేస్తూ అక్కడ అద్దెకు ఉంటున్నారు. వీరి కుమార్తె సోహని(19) మహారాష్ట్రలో ఇంటర్ పూర్తి చేసుకొని 40 రోజుల క్రితం జిల్లా కేంద్రానికి వచ్చింది. తనకు ఇంజినీరింగ్ చదవాలని ఉందని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు డబ్బులు లేవంటు నిరాకరించారు. దీంతో మనస్తాపానికి గురైన సోహని ఈ నెల 6న ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మొదటా జీజీహెచ్‌కు తర్వాత ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రౌడీషీటర్ గ్యాంగ్ అరెస్ట్



ఖలీల్‌వాడి: నగరంలో కత్తులతో బెదిరించి నగదు వసూలు చేస్తున్న ఓ రౌడీషీటర్ గ్యాంగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన బర్సాత్ అమీర్ అనే రౌడీషీటర్ తన సభ్యులతో కలిసి గత నెల 7న ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న షేక్ షారుక్ అనే వ్యక్తి నుంచి డబ్బులు ఇవ్వాలంటు కత్తులతో బెదిరించి దాడి చేసి రూ. 400 నగదును లాక్కున్నారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు రౌడీషీటర్ బర్సాత్ అమీర్‌తో పాటు సభ్యులు మహమ్మద్ షేక్ హసీమ్, ముద్దస్సిర్, షేక్ సుల్తాన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

జోరుగా వన మహోత్సవం

సాక్షి నెట్‌వర్క్:జిల్లాలో పలుచోట్ల బుధవారం వన మహోత్సవం జోరుగా నిర్వహించారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. పలువురికి మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు.



బాన్సువాడ ఆస్పత్రిలో మొక్కలు నాటుతున్న సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది



గండిమాసానిపేట జెడ్పీ పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



బోర్లం జెడ్పీహెచ్ఎస్‌లో ..



మోతెలో మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఎత్తిపోతలకు మళ్లీ తాళం

- భారంగా పథకం నిర్వహణ
- పేరుకుపోయిన రైతుల పన్ను బకాయిలు
- ప్రధాన పంప్‌హౌస్‌లో ప్యానెల్ బోర్డు సామగ్రి చోరీ
- ఆయకట్టు రైతుల్లో ఆందోళన



సాలూర మండలంలోని మంజీర నది తీరంలో ఉన్న ఎత్తిపోతల పథకం ప్రధాన పంప్‌హౌజ్

బోధన్: సాలూర గ్రామ శివారులోని మంజీర నదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకానికి మళ్లీ తాళం పడింది. ఏడాదిన్నర క్రితం దుండగులు ఈ పథకానికి సంబంధించిన కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి తీగలు, ఆయిల్‌ను అపహరించారు. దీంతో పంప్‌హౌస్‌కు తాళం వేశారు. స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చొరవతో రూ.10 లక్షలు మంజూరు చేయించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టడంతో పథకం వినియోగంలోకి వచ్చింది. ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందు ఎత్తిపోతల పథకం ప్రధాన పంప్‌హౌస్‌లో కరెంట్ మోటార్ల ప్యానెల్ బోర్డు అపహరణకు గురైంది. దీంతో లిఫ్ట్‌కు మళ్లీ తాళం పడింది. నిర్వహణ కమిటీ వద్ద డబ్బులు లేకపోవడంతో మరమ్మతులో జాప్యం జరుగుతోంది. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది.

2009లో పథకం ప్రారంభం

ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఎత్తిపోతల పథకానికి రూ.3.80 కోట్లు మంజూరు చేశారు. పనులు పూర్తిచేసి 2009లో పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద 1600 ఎకరాలను స్థిరీకరించారు. వర్షాధార మెట్ట భూములు సస్యశ్యామలమయ్యాయి. ఈ పథకాన్ని రైతులు ఐక్యతతో సద్వినియోగం చేసుకోవడంలో సఫలమై లబ్ధిపొందారు. సిబ్బంది వేతనాలు, ఇతర ఖర్చుల కోసం రైతులు మాగాణి ఎకరానికి రూ.800, మెట్ట ఎకరానికి రూ.600 చొప్పున పథకం కమిటీకి చెల్లిస్తారు. రైతులు చెల్లించాల్సిన పన్ను బకాయిలు పేరుకుపోయాయి.

దిగువకు మంజీర జలాలు

ఏటా వర్షాకాలం ప్రారంభంలో మంజీర నదిలో వరద నీరు చేరగానే లిఫ్ట్ మోటార్లు ప్రారంభించి గ్రామ శివారులోని చెరువులను నింపుతారు. ఈసారి నెల క్రితమే మంజీరలో వరద నీరు చేరినా మోటార్లు సిద్ధంగా లేకపోవడంతో దిగువకు కదలిపోతున్నాయి. ప్రస్తుతం గ్రామ శివారులోని ఏడు చెరువుల్లో నీళ్లు అడుగంటాయి. చెరువుల కింద కరెంట్ బోరుబావులున్న రైతులు మాత్రమే వరి నాట్లు వేస్తున్నారు. ఎత్తిపోతల పథకం కింద ఉన్న వందలాది ఎకరాల వర్షాధార మెట్ట భూముల్లో ప్రధానంగా సోయా మొలకెత్తింది. ఈ విషయమై సంఘం చైర్మన్ అల్లె జనార్దన్ దృష్టికి తీసుకెళ్లగా రైతుల సహకారంతో పథకం ప్రారంభానికి అన్నివిధాలా ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
■ సిరి అసోసియేట్స్ హౌస్ మార్టిగేజ్ పర్సనల్ ఓపెన్ ప్లాట్స్ రేకుల & గుణ పెంకుటిల్లుల పై రుణాలు ఇప్పించబడును. సెల్: 9666142226. [SCA25005831]

BUSINESS OFFER
■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937. [HA-480]

WANTED
■ Wanted Sales Manager and assistant sales manager in popular mobile stores are preferable. Ph.No: 9133399257, 9703333378. [G-145]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.